బీజేపీ డివిజన్ అధ్యక్షుల నియామకం

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా పరిధిలోని జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, నాంపల్లి నియోజకవర్గాల డివిజన్ అధ్యక్షులను నియమించినట్లు మూడు నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.శ్రీకాంత్, కో-రిటర్నింగ్ అధికారులు పందిర్ల ప్రసాద్, చిట్టి శ్రీధర్ తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా పూస రాకేష్, యూసుఫ్‌గూడ బి.రాజశేఖర్, వెంగళరావునగర్ ఎస్.నవీన్‌కుమార్, ఎర్రగడ్డ బి.విజయ్‌కుమార్, రహ్మత్‌నగర్ టి.లక్ష్మణ్, బోరబండ కె.వెంకటేశం నియమితులయ్యారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ఖైరతాబాద్ ఎ.ఆదర్శ్‌వంశీకర్, సోమాజిగూడ జి.సూర్యవినాయక్, వెంకటేశ్వరకాలనీ సీ.హెచ్.విజయ్‌కుమార్, బంజారాహిల్స్ ఎ.వినయ్ ముదిరాజ్‌లు నియమితులైనట్లు వెల్లడించారు. నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా సీహెచ్ ముఖేష్, విజయనగర్ కాలనీ డి.ఆనందరావు, అహ్మద్‌నగర్ కె.వినోద్‌కుమార్, రెడ్‌హిల్స్ ధరంసింగ్, గుడిమల్కాపూర్ దేవర వంశీ నియమితులయ్యారు. జిల్లా కౌన్సిల్ మెంబర్లను సైతం నియమించారు.



జీహెచ్‌ఎంసీ సిబ్బంది, స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

బంజారాహిల్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేతో పాటు సర్కిల్ పరిధిలో అన్ని విభాగాలకు సంబంధించి జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి జీహెచ్‌ఎంసీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీధిదీపాలు, పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయని, జీహెచ్‌ఎంసీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిలింనగర్ 18 బస్తీల వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు మామిడి నర్సింగ్‌రావు, రాము, శ్రీనివాస్, మాణిక్యం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బోరబండ నుంచి చర్లపల్లికి బస్ సర్వీస్

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు వెళ్లే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని బోరబండ నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సర్వీస్ నంబర్ 113ఎఫ్/జడ్ సర్వీస్ బోరబండ నుంచి హబ్సీగూడ, నాచారం, మల్లాపూర్ మీదుగా ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఇరువైపుల నుంచి ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జీవోలు, ఆర్డినెన్స్‌ల ద్వారా ఎలాంటి ఉపయోగం ఉండదని, ప్రత్యేక చట్టం తీసుకువస్తే న్యాయపరమైన అడ్డంకులు ఉండవన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం చేస్తామన్న ఆయన అవసరమైతే ఆమరణ నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి అధ్యక్షతన జరిగిన బీసీ సంఘాల సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతి లోపు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రిజర్వేషన్ల శాతం పెంచుతూ చట్టం తీసుకురావాలని, అన్ని రాజకీయ పార్టీలు దీనికి మద్దతివ్వాలని ఆయన కోరారు. ప్రత్యేక చట్టం తీసుకొచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దుచేయాలని, ప్రస్తుతం ఉన్న 13 కార్పొరేషన్లతో పాటు మరో 40 బీసీ కులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. బీసీలను విస్మరిస్తే గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు ర్యాగ రమేష్, పగిల్ల సతీష్, రాందేవ్‌మోదీ, నిమ్మల వీరన్న, నంద గోపాల్, మల్లేష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్ చోరీ

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని పారిపోయాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మాధవి (48) విశాఖపట్నం నుంచి కాచిగూడకు మహబూబ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తోంది. కాజీపేట్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి కిటికీలో నుంచి ఆమె హ్యాండ్‌బ్యాగ్ లాక్కొని పారిపోయాడు. బాధితురాలు గురువారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగ్‌లో 76 గ్రాముల బంగారు నగలు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 19 వేలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి కాజీపేట రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ తెలిపారు.

వైష్ణవ ఆలయాలకు వైకుంఠ ఏకాదశి శోభ

● ఆలయాలను సుందరంగా అలంకరించిన నిర్వాహకులు
● ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు
● భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం

అమీర్‌పేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవాలయాలకు ప్రత్యేక శోభ సంతరించుకుంది. అమీర్‌పేట, సనత్‌నగర్‌లోని హనుమాన్ ఆలయాలు, ఎస్‌ఆర్‌నగర్, సనత్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనం కల్పించేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ కాంతుల వెలుగుల్లో ఆలయాలు శోభాయమానంగా కనిపిస్తున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవోలు జయంతి, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ తెలిపారు. వైకుంఠ ఏకాదశి కావడంతో ఫిల్మ్‌నగర్‌లోని టీటీడీ ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సనత్‌నగర్‌లో నిర్వహించే వేడుకలకు రావాలని ఈవో సత్యనారాయణ స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మితో కలిసి గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, ముఖ్య అర్చకులు పరశురాం, రవీంద్రచార్యులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సుందరంగా ముస్తాబైన సనత్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం



వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అర్చకులు, కార్పొరేటర్ లక్ష్మి



ఉత్తర ద్వార దర్శనం కోసం ఎస్‌ఆర్‌నగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం ముందు వేసిన సెట్టింగ్

బీసీలు వివక్షకు గురవుతున్నారు

● పంజాల జైహింద్ గౌడ్

పంజాగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో బీసీలదే రాజ్యాధికారం అని పలువురు వక్తలు అన్నారు. బీసీఎఫ్ అధ్యక్షుడు ఎస్.చెన్నరాములు ముదిరాజ్ అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ నేతల 'చర్చావేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బీసీ, వివిధ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో బీసీలు అన్ని విధాలుగా వివక్షకు గరవుతూ రెండో శ్రేణి పౌరులుగా జీవిస్తున్నారన్నారు .భూమి లేదు, చదువ ,లేదు, ఉద్యోగం, ఉపాధి లేదు, కుల వృత్తులు ధ్వంసం అయిపోయి పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో మన ఓట్లు మనమే వేసుకుంటే రాజ్యాధికారం దక్కుతుందని.. ఆ తర్వాత నూతన చట్టాలను రూపొందించుకుని బీసీల జీవితాలను మార్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ ముదిరాజ్, మల్లేష్, బి.లింగస్వామి, పి.శ్రావణ్ కుమార్, బి.సిద్దేశ్వర్, మహేష్ గౌడ్, కె.యాదయ్య, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఇన్నోవేషన్స్‌పై జాతీయ సదస్సు

ఖైరతాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మానవుడు చేసే ఉత్తమ ఆలోచనలే టెక్నాలజీ రూపంలో వస్తాయని, వాటిని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని ప్రొఫెసర్ వి.విశ్వనాథం అన్నారు. బుధవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) ఆధ్వర్యంలో కళలు, సామాజిక శాస్త్రాలు, పరిశోధన, సాంకేతికతలో డిజిటల్ ఆవిష్కరణలు అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు ప్రారంభమైంది. తొలిరోజు దేశంలోని అనేక కళాశాలల అధ్యాపకులతో పాటు అమెరికా, లండన్‌ల నుంచి 87 పరిశోధన వ్యాసాలు వచ్చాయని సదస్సు అధ్యక్షుడు కూర రఘువీర్ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వనాథం మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సుల వల్ల విద్యార్థులతో పాటు మేధావుల్లో పరిశోధనాత్మక దృక్పథం పెరుగుతుందన్నారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్, గౌరవ అతిథి పూర్ణచందర్‌రావు 87 పరిశోధన వ్యాసాలతో కూడిన సంపుటిని ఆవిష్కరించారు. ఈ సదస్సు శుక్రవారం సైతం కొనసాగనుంది.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ విశ్వనాథం, రఘువీర్ తదితరులు

వాయు కాలుష్య నియంత్రణకు సహకరించండి

● జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు టీజీపీసీబీ సభ్యకార్యదర్శి లేఖ
● పోస్టర్‌ను ఆవిష్కరించిన కమిషనర్ ఇలంబరిది

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడాన్ని అరికట్టేందుకు తాము చేస్తున్న ప్రచారానికి సహకరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిదిని కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శి గుగులోతు రవి కోరారు. ఈ మేరకు ఆయనకు ఓ లేఖ రాశారు. గురువారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో పీసీబీ సిబ్బంది రూపొందించిన పోస్టర్‌ను ఇలంబరిది ఆవిష్కరించారు. మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు, యువకులకు వాయు కాలుష్యాన్ని తగ్గించడంపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు రాసిన లేఖలో పీసీబీ సభ్యకార్యదర్శి పేర్కొన్నారు. వాయు కాలుష్యం-దాని ప్రభావంపై ఈ నెల 24న కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని, పోటీల్లో గెలుపొందిన 12 బృందాలకు రూ.10వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని కళాశాలల్లో సిబ్బందితో ప్రచారం చేయించాలని విజ్ఞప్తి చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్

నీటిశుద్ధికి సరికొత్త విధానం

● తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో నీటిని శుద్ధి చేయొచ్చంటున్న ప్రొ.వెంకటేశ్వర్

పంజాగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మురుగు, కెమికల్స్ కలిసిన నీటిని శుద్ధి చేసి స్వచ్ఛమైన నీటిగా మార్చేందుకు తాము కనిపెట్టిన సీవీఆర్ పద్ధతి ఎంతగానో దోహదపడుతుందని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సి.వెంకటేశ్వర్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన తాను కనిపెట్టిన విధానం ద్వారా నీటిని శుద్ధిచేయడాన్ని చేసి చూపించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. బాల్కాపూర్ నాలా నుంచి 100 మిలియన్ల మురుగునీటిని తాము నాలుగు నెలల సమయంలోనే శుభ్రపరిచి ఇచ్చామని, ప్రపంచంలోనే అంత ఎక్కువ మొత్తం నీటిని ఇంత తక్కువ సమయంలో శుభ్రపరచడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. మూసీ నది ప్రక్షాళన కోసం సీఎం రేవంత్ రెడ్డి 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నది వెంబడి నిర్మించదల్చుకున్నారని, ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినా ఎస్టీపీ విధానంలో శుభ్రపరిచిన నీటి నుంచి పూర్తిగా మలిన పదార్థాలు బయటికి వెళ్లవన్నారు. అవి వినియోగానికి పనికిరావన్నారు. తాము రూపొందించిన విధానంలో శుద్ధి చేసిన నీటితో వ్యవసాయం, చేపల పెంపకం సాధ్యమని నిరూపితమైందన్నారు.



సీవీఆర్ విధానం గురించి వివరిస్తున్న ప్రొఫెసర్ సి.వెంకటేశ్వర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ ఆంధ్రజ్యోతి, నాగార్జున హిల్స్, ఓబుల్ రెడ్డి స్కూల్ ఫీడర్ల పరిధిలోని జలగం వెంగళరావు పార్క్, ఎస్ఎంఆర్ బిల్డింగ్, ప్రభుత్వ పాఠశాల, బాటా షోరూమ్, మహీంద్రా షోరూమ్, కార్పొరేషన్ బ్యాంక్, లిటిల్ స్టార్ ఆసుపత్రి, రోడ్ నంబర్లు 10బి, 10సి, 25, 33, 34, 35, 36 ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ టైమ్స్ ఆఫ్ ఇండియా, ఐవీఆర్ సీఎల్, ఫిలింనగర్ ఫీడర్ల పరిధిలోని ఆల్మండ్ హౌస్, రోడ్ నంబర్లు 2, 3, ముఫకంజా కాలేజ్ ఎదురు ప్రాంతం, ఐవీఆర్‌సీఎల్ డీకే బస్తీ కమ్యూనిటీహాల్, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36, 41, 55 పెద్దమ్మ టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



వస్త్ర ప్రదర్శనలో ఆసక్తిగా తిలకిస్తున్న మహిళలు

హ్యాండ్ టు హ్యాండ్ వస్త్ర ప్రదర్శనకు ఆదరణ

బంజారాహిల్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నెం:12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న హ్యాండ్ టు హ్యాండ్ వస్త్ర ప్రదర్శనకు మంచి ఆదరణ లభిస్తుంది. ఈ వస్త్ర ప్రదర్శనలో 'సిల్క్ మార్క్' ధృవీకృత సిల్క్ ఉత్పత్తులు, కాటన్ శారీస్, కుర్తీస్, డ్రెస్‌మెటీరియల్స్ తదితర ఎన్నో రకాల ఉత్పత్తులు ఉన్నాయని, చివరి నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'డాకు మహరాజ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ నటించిన డాకూ మహరాజ్ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్ గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించనున్నారు. భారీగా అభిమానులు, సందర్శకులు, సినీ ప్రియులు, వీఐపీలు తరలివచ్చే అవకాశం ఉండటంతో నేడు యూసఫ్‌గూడ ప్రాంతంలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 వరకు ట్రాఫిక్ ఆంక్షలుంటాయని పోలీసులు తెలిపారు. జూబ్లీచెక్‌పోస్ట్ నుంచి వచ్చే వాహనాలను కృష్ణానగర్ నుంచి శ్రీనగర్‌కాలనీ వైపునకు మళ్లిస్తారు. మైత్రివనం వైపు నుంచి వచ్చే వాహనాలను యూసఫ్‌గూడ బస్తీ నుంచి ఆర్‌బీఐ క్వార్టర్స్, కృష్ణానగర్ జంక్షన్ వైపునకు.. మైత్రివనం నుంచి బోరబండ వైపు వెళ్లే వాహనాలను కల్యాణ్‌నగర్ వైపునకు మళ్లిస్తారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చే వాహనదారులు తమ వాహనాలను జానకమ్మతోట, సవేరా ఫంక్షన్‌హాల్‌లో నిలుపుకోవాల్సి ఉంటుంది.

యాత్రలకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

యూసుఫ్‌గూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): యాత్రలకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రహ్మత్‌నగర్ ప్రాంతంలో నివసించే పాపారావు కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 26న స్నేహితులతో కలిసి యాత్రలకు వెళ్లి ఈ నెల 8న ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వచ్చి తాళం తీయగా తలుపు తెరుచుకోలేదు. బాల్కనీ నుంచి ఇంట్లోకి ప్రవేశించగా ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. రూ2 లక్షల విలువైన కెమెరా, ఇతర వస్తువులు కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

హైదరాబాద్‌లో గ్లోరియస్ మిస్, మిసెస్ పోటీలు

పంజాగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వేదికగా గ్లోరియస్ మిస్, మిసెస్, రాయల్ మిస్టర్ ఇండియా పోటీలు జరగనున్నాయి. ఏప్రిల్ నెలలో ఈ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ విభాగం మాజీ జాతీయ అధ్యక్షుడు అజయ్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీఐ, షిమెరింగ్ స్టార్‌లైట్ క్రియేషన్స్ ప్రతినిధులు స్నేహాల్, క్రాంతికుమార్ పాల్వాయి, సబీనా, నిరూప పటేల్‌లతో కలిసి పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెసీఐ, షిమెరింగ్ స్టార్‌లైట్ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ పోటీలకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, ఈ పోటీల ద్వారా సమీకరించే నిధులను సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు.

క్లినికల్ జెనెటిక్స్‌పై నిమ్స్‌లో వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, ఇండియన్ అకాడమీ ఆఫ్ మెడికల్ జెనెటిక్స్ పీడియాట్రిక్ రేర్ జెనెటిక్ డిజార్డర్స్‌పై డీబీటీ మిషన్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో గురువారం నిమ్స్ ఆడిటోరియంలో వర్క్‌షాప్ నిర్వహించారు. యుటిలిటీ అండ్ ఇంటర్‌ప్రెటేషన్ ఆఫ్ జెనెటిక్ టెస్ట్ ఇన్ క్లినికల్ ప్రాక్టీస్ పేరుతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌నకు పీడియాట్రిక్స్, వివిధ విభాగాల నుంచి 100 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. జన్యు పరీక్షకు సంబంధించిన అన్ని అంశాలు, కార్యోటైపింగ్ వంటి ప్రాథమిక పద్ధతుల నుంచి తదుపరి తరం సీక్వెన్సింగ్, ఆప్టికల్ జీనోమ్ మ్యాపింగ్ వంటి అధునాతన పరీక్షల అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లినికల్ ప్రాక్టీస్‌లో జన్యుశాస్త్రం ప్రాముఖ్యతను ఆయన వివరించారు. మెడికల్ జెనెటిక్స్ విభాగం ప్రొఫెసర్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్ మాట్లాడుతూ.. ప్రతి వైద్యుడు జన్యుశాస్త్రం ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) విభాగాధిపతి డాక్టర్ అశ్విన్ దలాల్, జన్యు నిర్ధారణపై అవగాహన కలిగించేందుకు చొరవ తీసుకున్న నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ విభాగానికి అభినందనలు తెలిపారు.



వర్క్‌షాప్ నిర్వహిస్తున్న దృశ్యం



సూత్ర ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తాజ్‌కృష్ణాలో 'సూత్రా' ఎగ్జిబిషన్

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశం నలుమూలల నుంచి 100 మందికి పైగా డిజైనర్‌లు రూపొందించిన వివాహ ప్రత్యేక వస్త్రాల ఎగ్జిబిషన్ సూత్ర స్పెషల్ ఎడిషన్ నగరంలో ప్రారంభమైంది. బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో జనవరి 9 నుంచి మూడు రోజుల పాటు 11వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సూత్ర స్పెషల్ ఎడిషన్ సేల్స్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. బ్రైడల్ కోచర్, ట్రెండింగ్ లెహంగాలు, బెస్పోక్ జ్యువెలరీ, డిజైనర్ క్లచ్‌లు, పాదరక్షలు, గృహాలంకరణ వస్తువులతో పాటు సాంప్రదాయ వస్త్రాలు, ఆధునిక లేటెస్ట్ ట్రెండ్ దుస్తులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. తారా జ్యువెలరీ, బెంగాల్ హ్యాండ్‌లూమ్ ఆర్ట్, గోపీ జ్యువెలర్స్, తపస్వీ డిజైనర్స్‌కు చెందిన దుస్తులు, హ్యాండీక్రాఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

హైదరాబాద్‌లో బీఈ నైపుణ్యాభివృద్ధి కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బయోలాజికల్-ఈ (బీఈ)కి చెందిన సీఎస్ఆర్ విభాగం డాక్టర్ విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్.. హైదరాబాద్‌లోని బొల్లారంలో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) భాగస్వామ్యంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రారంభించింది. నిరుద్యోగ యువతలో ఉపాధికి అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు ఇది కృషి చేస్తుందని ఆ సంస్థ ప్రకటించింది. ఫార్మా, టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, డిజిటల్ కమ్యూనికేషన్, రిటైలింగ్ వంటి అధిక డిమాండ్ గల విభాగాల్లో ఈ కేంద్రం ఉచిత శిక్షణ, వృత్తి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఒక్కో శిక్షణ కార్యక్రమం మూడు నెలల పాటు ఉంటుంది. ఈ శిక్షణా కార్యక్రమాల్లో చేరేందుకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. ఇందుకోసం ఖాళీగా ఉన్న జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్ భవనాన్ని ఆధునికీకరించి క్లాస్‌రూమ్‌లు, క్యాంటీన్, కౌన్సెలింగ్ రూమ్, ఫార్మా శిక్షణ ల్యాబ్, 16 సీట్ల కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్టు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ తృష్ణ రాజు తెలిపారు. ఏడాదికి 600-720 మంది స్థానిక యువతకు శిక్షణ ఇవ్వగలమని భావిస్తున్నట్టు ఆమె చెప్పారు.

ఫైలేరియాసిస్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి


డాక్టర్ సక్కుబాయి

పద్మారావునగర్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియాసిస్ వ్యాధి నిర్మూలన కోసం నిర్వహించే రక్త నమూనా సేకరణ సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీతాఫల్‌మండి క్లస్టర్ ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ సక్కుబాయి తెలిపారు. ఫైలేరియాసిస్ సర్వే వివరాలు తెలుపుతూ.. దోమల ద్వారా వ్యాప్తి చెందే ప్రమాదకరమైన వ్యాధిని నిర్మూలించటానికి, ప్రభుత్వ ఆరోగ్య శాఖ సూచలనల మేరకు సీతాఫల్‌మండి క్లస్టర్ పరిధిలోని కుట్టివెలోడి ఆరోగ్య కేంద్రం, బోయగుడా ఆరోగ్య కేంద్ర ఆరోగ్య సిబ్బంది మూడు రోజుల పాటు రాత్రి 8 గంటల నుంచి 12 గంటల వరకు ఫైలేరియాసిస్ రాత్రి రక్త సర్వే ద్వారా నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతారని తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో సర్వే నిర్వహించారని, 10వ తేదీ రాత్రి బన్సీలాల్‌పేట్‌లో రక్త నమూనా సర్వే నిర్వహిస్తారని, ఆరోగ్య సిబ్బందికి నమూనా సేకరణలో సహకరించాలని ఆమె తెలిపారు. రాత్రి సమయంలో మాత్రమే పరాన్నజీవులు రక్తంలో కనిపిస్తాయని దాని కోసమే రక్త నమూనాను రాత్రి వేళల్లో సేకరిస్తారని తెలిపారు. ఈ సర్వే ద్వారా వ్యాధి వ్యాప్తిని తెలుసుకొని అవసరమైన ప్రణాళికలు రూపొందించవచ్చని, రక్త నమూనా తీసుకోవడం వల్ల ఎలాంటి హాని కలగదని సురక్షితమైనదిగా వర్ణించారు. ఎలాంటి సందేహం లేకుండా నమూనాను ఇవ్వాలని, అనంతరం ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలని ఆమె తెలిపారు.

కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు


నామాలగుండులో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

బౌద్ధనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. గురువారం నామాలగుండులో చేపట్టిన డ్రైనేజీ పనులను జలమండలి అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నామాలగుండులో కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారని, దీంతో మ్యాన్‌హోల్స్ డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. కలుషిత నీరు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఏసీపీ

తిరుమలగిరి జనవరి 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు ఏసీపీ రమేష్ సూచించారు. గురువారం తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమలగిరి చౌరస్తాలో గల యూఎన్ అకాడమీ ఇనిస్టిట్యూట్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు జీవితాలను చిత్తు చేస్తాయని తెలిపారు. సదస్సులో తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

'పాఠశాల ఎదుట ఆక్రమణలను తొలగించండి'

రాంగోపాల్‌పేట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాఠశాల ఎదుట ఆక్రమణలను తొలగించాలని ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజుకు నాగెల్లి దుర్గయ్య ప్రథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ సుబాష్ రోడ్డులోని తమ పాఠశాలకు ఇరువైపులా కొంతమంది వ్యాపారాలను కొనసాగిస్తూ వారి వాహనాలను పాఠశాల గేట్‌కు అడ్డంగా పెడుతున్నారని తెలిపారు. ఈ విషయమై గతంలో అనేకమార్లు మహంకాళి ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాటిని తొలగించడం, తరువాత యథావిధిగా వ్యాపారాలు, అక్రమ పార్కింగ్‌లు కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ట్రాఫిక్ ఏసీపీకి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.


ఫుట్ బాల్ ఆటగాళ్లను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు శౌరి తదితరులు

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో నల్లగుట్ట విద్యార్థుల ప్రతిభ

రాంగోపాల్‌పేట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎనేబిలింగ్ లీడర్‌షిప్ ప్లే (పౌల్ బొంకే) వారు గోల్కొండ క్రీడా మైదానంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల(ఓల్డ్) ఆవరణలోని ప్రాథమిక పాఠశాల (డిజిటల్) విద్యార్థులు సబ్ జూనియర్ (అండర్ - 10) విభాగంలో హైదరాబాద్ రీజియన్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నాబత్తిని శౌరి, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ హైదరాబాద్ రీజియన్‌లో ఆరు రోజుల పాటు కొనసాగిన లీగ్ మ్యాచ్‌లలో అండర్ - 10 విభాగంలో 700 మంది బాలబాలికలు 35 టీమ్‌లుగా ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 13 ప్రైవేటు, 5 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నారన్నారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పీవీఆర్ స్కూల్‌తో తలపడ్డ తమ విద్యార్థులు 0-1 గోల్స్‌తో టోర్నమెంట్ రన్నరప్‌గా నిలిచారని ఆయన తెలిపారు.

శబరిమలైకి ఎమ్మెల్యే..



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ గురువారం బొల్లారం అయ్యప్ప స్వామి గుడిలో ఇరుముడి కట్టుకుని శబరిమలైకి బయల్దేరారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్‌రెడ్డి, బద్దం బల్వంత్‌రెడ్డి, నరేష్ ముదిరాజ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- తిరుమలగిరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి)


విద్యుత్‌దీపకాంతులతో నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం


విద్యుత్‌దీపాలతో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు


ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్తరద్వారాలు

ఆలయాలకు వైకుంఠ శోభ

సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని పలు ఆలయాలు వైకుంఠ ఏకాదశి శోభను సంతరించుకున్నాయి. ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తుల కోసం ఉత్తరద్వార దర్శనంతో పాటు చలవపందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు.


బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం


బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులు

బోయిన్‌పల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ల కోసం వెదురుకర్రలతో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రసాద కౌంటర్లు, తాగునీరు, పూజల కోసం సన్నాహాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో, గర్భగుడిని సుందరంగా అలంకరించిన స్వామి వార్ల రూపాలను ఉత్తరద్వారం గుండా భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలు, పలురకాల పూలతో, శ్రీవారి అలంకరణ ప్రక్రియ ప్రారంభమైంది. వేంకటేశ్వరస్వామి ఆలయంలో శేష వామనంపై స్వామి వారు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు నారాయణ తెలిపారు. చలువపందిళ్లు, క్యూలైన్లు, వాహన పార్కింగ్ స్థలాలు, ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్వామివారికి శుక్రవారం తెల్లవారు జామున 2గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5గంటల నుంచి భక్తులకు స్వామి వారి దర్శనానికి అనుమతివ్వనున్నట్లు తెలిపారు.

నామాలగుండులో..

బౌద్ధనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. విద్యుత్‌దీపాలతో స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సుమారు 75వేలు నుంచి లక్ష మంది భక్తులు హాజరవుతారని ఆలయ నిర్వాహకులు నోముల ప్రకాశరావు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కిలోమీటరు మేర బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏర్పాట్లు పర్యవేక్షించిన డీసీపీ

నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్ర, శనివారం జరిగే వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్ రెడ్డి, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ గురువారం పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావుకు సూచించారు. భక్తులు తోపులాట, గుమిగుడటం వంటివి జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కరాటేరాజు, జగ్గు, కమిటీ సభ్యులు నాగులూరి శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్‌సింగ్ తదితరులు ఉన్నారు.


లాల్‌బజార్‌లోని భక్తాంజనేయ స్వామి దేవాలయం

శ్రీనివాస్‌నగర్‌లో వైద్యశిబిరం

శ్రీనివాస్‌నగర్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటుచేస్తున్నామని కేఎం క్లినిక్ నిర్వాహకుడు డాక్టర్ అజయ్ బీ మోసుర్ తెలిపారు. షుగర్, బీపీ, ఫీవర్ తదితర రుగ్మతలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని భక్తులు, స్థానికులు ఉపయోగించుకోవాలని వారు కోరారు.


లాల్‌బజార్‌లో వేంకటేశ్వర స్వామి మూలవిరాట్

లాల్‌బజార్‌లో..

తిరుమలగిరి జనవరి 9(ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలోని ఉప దేవాలయం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు హనుమాన్ ఆలయ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వం సిద్ధం చేసింది. ఉదయం 5:30 గంటలకు వైకుంఠ ద్వార పూజ 6గంటలకు అభిషేకం, వస్త్ర అలంకరణ సేవ లాంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు హనుమాన్ వెల్ఫేర్ కమిటీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం అల్పాహారం మధ్యాహ్నం 12:30కి అన్నప్రసాదం ఉంటుందని తెలిపారు. లాల్‌బజార్, తిరుమలగిరి, శ్రీనగర్ కాలనీ, పెరుమాళ్ హట్స్, శాస్త్రీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకోవాలని ఆలయకమిటీ సభ్యులు సూచించారు.


కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, ఏసీపీ జైపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సామల హేమ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మేయర్ గద్వాల విజయలక్ష్మి
- బౌద్ధనగర్‌లో సుడిగాలి పర్యటన


అంబర్‌నగర్‌లో నాలా పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

బౌద్ధనగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని, జాప్యం లేకుండా సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ ఎళ్లవేళలా సిద్ధంగా ఉందని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్‌లో గురువారం ఉదయం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 8:30గంటలకు ప్రారంభమైన పర్యటన 11 గంటల వరకు సాగింది. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ డివిజన్లో నెలకొన్న సమస్యలను మేయర్‌కు చూపించారు. బౌద్ధనగర్, ఎల్.నారాయణనగర్, అంబర్‌నగర్, అంబానగర్ తదితర ప్రాంతాల్లో నాలాలు, రోడ్లు, మ్యాన్‌హోళ్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. అంబర్‌నగర్‌లో ఏకశిలా మెడికల్‌హాల్ ఎదురు వీధిలో రోడ్డుమీద ఉన్న ఇనుప వస్తువులను తొలగించాలని షాపు యజమానికి సూచించారు. రోడ్లపై ఇనుప వస్తువులు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజల ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం శానిటేషన్, మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలపై అధికారులతో చర్చించారు. సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాక్స్ డ్రైనేజీ నిర్మాణపనులు త్వరితగతిన చేపట్టాలని, నాలా కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని అధికారులకు మేయర్ సూచించారు.

రోడ్డు వేయాలని వారాసిగూడ వాసుల విజ్ఞప్తి

బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడ పోచమ్మ ఆలయ వీధిలో రెండు సంవత్సరాల క్రితం రోడ్డును తవ్వేసి నిర్లక్ష్యంగా వదిలేశారని బస్తీవాసులు మేయర్ గద్వాల విజయలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. మేయర్ వెంటనే అధికారులతో కలిసి పోచమ్మ ఆలయ వీధిలో పర్యటించి తవ్విన రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణాలను పెండింగ్‌లో పెట్టొద్దని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిధులను కేటాయించి నూతన రోడ్డును నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్‌నాయుడు, రఘు ప్రసాద్, నార్త్‌జోన్ కమిషనర్ రవికిరణ్, సీఈ భాస్కర్‌రెడ్డి, ఎస్ఈ రత్నాకర్, కార్పొరేటర్ కంది శైలజ, సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు, డీఈ వెంకటేశ్వర్లు, హర్టికల్చలర్ అధికారి పద్మనాభం, కాంగ్రెస్ నాయకుడు ఆదం సృజన్, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు అమర్‌నాథ్‌గౌడ్, అనిల్, జగ్గు తదితరులు మేయర్ వెంట ఉన్నారు.

పౌష్టికాహార ప్రదర్శన


కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పౌష్టికాహార ప్రదర్శనలో విద్యార్థుల సందడి

మారేడుపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ, పీజీ కాలేజ్ ఫర్ ఉమన్ కళాశాలలోని పౌష్టికాహార, డైటెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ డైటెటిక్స్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఆరోగ్యం, జీవనశైలి వ్యాధుల నివారణలో ఆహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు పౌష్టికాహార ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ మంగవాణి, డాక్టర్ శాలిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సునంద కలిసి ప్రారంభించారు. మేనేజ్‌మెంట్ సభ్యులు రవి కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి బ్యాల అపరంజి (హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్), పి.శ్వేత, మంజరి, దివ్యరూప, బుష్రా, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు నాయకత్వం వహించారు. ప్రదర్శనలో పోషకహార వంటకాలు, న్యూట్రీ రంగోలి, ఫుడ్ స్టాల్స్ వివిధ ఎగ్జిబిట్లు ప్రదర్శించబడ్డాయి. జీవనశైలి వ్యాధులు, బ్యాలెన్స్ డైట్ మోడల్స్, చార్ట్స్, పోస్టర్లు ప్రదర్శించారు. మొత్తం 500 మంది విద్యార్థులు, సిబ్బంది ప్రదర్శనను సందర్శించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మారేడుపల్లి కస్తూర్బా గాంధీ మహిళా జూనియర్ కళాశాలలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ దానగౌడ్, అధికారి డాక్టర్ శంకర్, ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, జవాన్లు జాహంగిర్, నర్సింగ్‌రావు, ప్రభాకర్, ప్రవీణ్, యతేశ్వరి, లోత్కు, కోటయ్య, సదానంద్ పాల్గొన్నారు.

సంజీవరెడ్డినగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి


సంజీవరెడ్డినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మారేడుపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంజీవరెడ్డి నగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్‌మారేడుపల్లిలోని తన కార్యాలయంలో సంజీవరెడ్డినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, గౌతమ్, వివేక్‌నాథ్, అమర్నాథ్‌రెడ్డి, రోజారెడ్డి, స్టీవెన్, డేవిడ్ రాజ్, అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ ఉన్నారు.

తలసానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

తిరుమలగిరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్‌కుమార్, కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త సతీష్ ఉన్నారు.

బీజేపీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడిగా ఆదర్శకుమార్



చిలకలగూడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడిగా మైలార్‌గడ్డ వాసి కె.ఆదర్శ కుమార్‌ని నియమిస్తూ రిటర్నింగ్ ఆఫీసర్ సి.హెచ్.శంకర్ రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ప్రతిష్ఠతకు కృషి చేస్తానని ఆదర్శకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మారేడుపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సౌమ్య తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీబస్‌స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 13వద్ద బుధవారం మధ్యాహ్నం 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి స్పృహలేకుండా పడిఉన్నాడని సమాచారం అందుకున్న మారేడుపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే మారేడుపల్లి పోలీసులను సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

ఫుట్‌పాత్‌పై మరో వ్యక్తి...

అడ్డగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై చనిపోయిన ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ బసేరా హోటల్ సమీపంలో 45 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు వచ్చి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.